# ఇంటివెలుగు

క్రితంసారి కంటె ఈ యేడాది ఫలితాలు పదిరోజులు ఆలస్యంగా ప్రకటించారు. హెడ్మాస్టరు తీర్థయాత్రల నుంచి అనుకున్న తేదీకి రాలేకపోయాడు. ఇన్‌ఛార్జి పక్క వూళ్ళో వుంటున్నాడు. తక్కిన టీచర్లు పేపర్లు దిద్దడం నత్తనడకలా సాగింది.

ఇంకా నయం - చెప్పినదానికంటే ఒకరోజు ముందుగా ప్రకటించారు. మర్నాడు చెబుతారని అందరూ అనుకున్నారు. నోటీసుబోర్డులో అలాగే తెలియజేశారు.

ఫలితాలు ఆలస్యంగా వచ్చినందుకు జయకి బాధేమీలేదు. మంచి మార్కుల్తో ప్యాసైనందుకు సంతోషంకూడా ఏకోశానా లేదు. పదేళ్ళ వయస్సులో వున్న జయ చెంగుచెంగున గంతులెయ్యాలి. ఆరో తరగతి ప్యాసయ్యానని ఎరిగున్నవాళ్ళందరికీ చెప్పాలి. కాని అలా జరగలేదు.

క్రిందటి సంవత్సరం బడినుంచి ఇంటికొచ్చి అమ్మని కావలించుకుని 'అమ్మా! నేను క్లాసు ఫస్టు వచ్చా' అని పట్టరాని సంతోషంతో చెప్పింది.

'నా తల్లీ, నా బంగారుకొండే! నీకుకాక ఎవరికొస్తాయమ్మా అన్ని మార్కులు?' తల్లి సీత గర్వంతో ఆనందం పంచుకుంది.

గబగబా పక్కింటివాళ్ళకి ఈ కబురు అందించింది. భర్త కనకయ్యని బజారు పంపి మిఠాయి తెప్పించింది. చుట్టుపక్కలందరికీ పంచింది. పాయసం చేసింది. బంధువులకి ఉత్తరాలు రాయించింది. పరికిణీకి, జాకెట్టుకు సిల్కుగుడ్డకొని టైలరికిచ్చింది.

జయకి అవన్నీ కళ్ళకి కట్టినట్టే వున్నాయి.

ఇంటికొచ్చింది. వచ్చీరాగానే నాయనమ్మ మెడచుట్టూ చేతులువేసి 'నేను ఆరోతరగతి ప్యాసయ్యా నాయనమ్మా!' అంటూ బావురుమని యేడ్చింది.

'సంతోషం తల్లీ!' మనవరాల్ని పొదివి పట్టుకుని గొల్లుమంది.

కాసేపు మాటలు రాలేదు. కన్నతల్లి కోసం అలమటించే చిన్నారి మనసు ఏమని చెబితే వూరడిల్లుతుంది? కాన్పు కష్టమై సీత కన్నుమూసి యేడాదయింది. బిడ్డకూడా దక్కలేదు.

ఏడూర్లు పెట్టి కనకయ్య వూరు వెళ్ళాడు.

మనవరాల్ని సముదాయిస్తూ 'జయా! మీ అమ్మవుంటే పెద్ద పండగ చేసేది. పెద్దదాన్ని నేనేం చేయగలను? ఏ లోకంలో వున్నా సీతమ్మకి ఈ కబురు తెలుస్తుంది.

తప్పక సంతోషిస్తుంది. నిన్ను దీవిస్తుంది. జడ వేసుకో. మీ నాన్నొచ్చేది ఇవ్వాళే కదూ?' అని గుర్తు చేసింది.

'నాయనమ్మా! పొలం వెళ్ళి అమ్మతో నేను ప్యాసైన సంగతి చెప్పొస్తా.'

'జడవేస్తా, మంచి గౌను వేసుకో, తల్లో పూలు పెడతా. అప్పుడు వెళ్ళుదువుగాని! చక్కగా వెళ్తే మీ అమ్మ ఎంతో సంతోషిస్తుంది.'

జయ కాదనలేదు. మౌనంగా జడ వేయించుకుంది. పొలానికి బయలుదేరింది. అడుగులు వేగంగా పడుతున్నాయి.

తీవ్రంగా ఆలోచన్లు ఆ లేతహృదయాన్ని చుట్టుముట్టి కలవరపరుస్తున్నాయి.

తల్లి అన్నా, తనన్నా పంచప్రాణాలు ఇచ్చే తండ్రి అన్నీ మరిచిపోయినట్టు ఏడూర్లు కాగానే పెళ్ళికొడుకుగా మారిపోయాడు. దేవతలాంటి తల్లి అప్పుడే తండ్రి మనసులో నుంచి మరుగైపోయిందా? రెండోపెళ్ళి చేసుకొస్తున్నాడు. భర్తపోతే పుట్టింట్లో వుంటున్న చిన్నమ్మ మాణిక్యాన్ని చేసుకుంటున్నాడు. ఎందుకిలా జరుగుతోంది? తన సర్వస్వంగా ఎంచే తండ్రి ఎలా మారుమనువుకి సిద్ధపడ్డాడు? తన చదువు సాగుతుందా? చిన్నమ్మయినా ఇప్పుడు సవతి తల్లేకదా! ఎన్ని బాధలు పెడుతుందో యేమో! పిల్లలు పుట్టిన తర్వాత తన కష్టాలకు అంతే వుండదు. తండ్రి కూడా మారిపోతాడు. చిన్నమ్మ చేతిలో కీలుబొమ్మవుతాడు. అప్పుడు తను ఇంకా యాతనల పాలవుతుంది.

జయ కళ్ళలో కన్నీళ్ళు కమ్ముకున్నాయి. కాలిబాట సరిగా కనిపించడం లేదు. కళ్ళు తుడుచుకుంది. ఎదురుగా తల్లి సమాధి. మామిడిచెట్టు కింద అందమైన దిన్నె.

దానిపైన వాలిపోయింది. వెక్కివెక్కి యేడ్చింది.

సంబాళించుకుంది.

'అమ్మా!... అమ్మా! నేను ఫస్టున ప్యాసయ్యానమ్మా! నువ్వు కిందటేడు సంబరంతో ఎంత హడావుడి చేశావ్? ఇప్పుడు నాయనమ్మ పెద్దది, ఏం చేస్తుంది... అమ్మా! నేను ఇంకా బాగా చదువుకుంటానమ్మా! నీ కోరిక నెరవేరుస్తాను. ఎక్కడున్నా నువ్వు ఆనందిస్తావని నాకు తెలుసు. నా మాటలు నీకు వినపడతాయి కాని నీ మాటలే నాకు వినిపించవు. కల్లో ఎప్పుడూ నువ్వే కనిపిస్తావమ్మా! కళ్ళు తెరిస్తే నువ్వుండవు. నీ ఫోటో వుంటుంది. నవ్వుతూ నన్ను పలకరిస్తుంది. అమ్మా! నీకింకో సంగతి చెప్పాలని వచ్చా. నాన్న మళ్ళీ పెళ్ళి చేసుకునేందుకు వెళ్ళాడు. నేను భరించలేను. ఇది నీకు ద్రోహం కాదా? చిన్నమ్మను చేసుకుంటున్నాడు. ఎవరైనా సరే, నిన్ను మరిచిపోయినట్టేగా అమ్మా! నాన్న ఇంత ఘోరం చేస్తాడనుకోలేదు. పెళ్ళి చేసుకుని ఇవ్వాళే మనింటికి వస్తారమ్మా! ఆ యింట్లో నేనెలా వుండను? మరి ఎక్కడుండాలో చెప్పమ్మా. అమ్మా! చెప్పు....'

జయ మూగరోదనకు బదులు లేదు.

దూరంగా ఎడ్లబండి గంటల చప్పుడు విని జయ తలెత్తిచూసింది. అది తమ బండే. పొలంవైపే వస్తోంది.

జయ గబగబా వెళ్ళి దగ్గర్లో వున్న చింతచెట్టు చాటున నిల్చుంది. ఇక్కడ వారి కంటపడడం ఇష్టంలేదు.

ఆశ్చర్యం! బండిని బండ్ల బాటలో ఆపి సమాధివైపే వస్తున్నారు. పెళ్ళిచేసుకుని వచ్చినవాళ్ళు రామాలయానికో గ్రామదేవత గుడికో ముందు వెళ్ళడం అలవాటు. సమాధి దగ్గరికి రావడం వింత అనిపించింది జయకి.

అక్కడ ఏం జరుగుతుందో కుతూహలంతో గమనిస్తోంది.

తండ్రీ, చిన్నమ్మా చేతులు జోడించి సమాధి చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణలుచేసి నమస్కరించారు.

తండ్రి అమ్మ సమాధితో అంటున్నాడు :

'సీతా! నువ్వు దేవతవు. ఇదిగో నీ చెల్లెలు మాణిక్యం. చివరి శ్వాస విడిచేటప్పుడు నువ్వు రహస్యంగా నా చేత ప్రమాణం చేయించుకున్నావు – గుర్తుందా? మన చిట్టి తల్లికి నీ కోరికప్రకారం మరో అమ్మను తెచ్చాను. అసలు అమ్మను తేలేనుగా? నీ మాట కాదనలేక ఈ పని చేశాను. మళ్ళీ పెళ్ళికి ఉబలాటపడి కాదు సీతా! ఇప్పుడు మన జయకి తల్లి కావాలి. ఆలనా పాలనా చూసే ఆడమనిషి కావాలి. ఈ బాధ్యత నాకప్పగించి నువ్వు దేవతవై వెళ్ళిపోయావు.' బిగ్గరగా ఏడ్చాడు.

జయకి ఏడ్పు వచ్చింది. కాని వింటారని దిగమింగుకుంది.

'ఊరుకో బావా! ఉన్నంతకాలం మీకు సేవ చేసింది. నలుగురి చేత ఉత్తమురాలనిపించుకుంది. పసుపుకుంకుమలతో సుమంగళిగా వెళ్ళిపోయింది సీతక్క.' మాణిక్యం ఓదార్పుగా అంది.

కనకయ్య ఉత్తరీయంతో కళ్ళుతుడుచుకున్నాడు.

'సీతా! నువ్వు చెప్పిన మరో మాట మాత్రం నేను పాటించలేదు. అది నాకు సమ్మతం కాదుకూడా. మాణిక్యాన్ని పెళ్ళి చేసుకుని ఇంటికి వెలుగుగా కొడుకును కనమని చెప్పావు. ఈ విషయంలో నువ్వు నన్ను అర్థం చేసుకోలేకపోయావ్ సీతా! నేనూ అందరిలాంటివాడిన్నే అనుకున్నావ్ కదూ! నేను పెళ్ళికి ఒప్పుకుందీ, నీకు ప్రమాణం చేసి చెప్పిందీ జయ మంచి కోసమే. జయ మా సర్వస్వం. ఇంకా సంతానంతో మాకేంపని? అందుకనే మాణిక్యాన్ని పెళ్ళిచేసుకోవడానికి ముందే నేను ఆపరేషను చేయించుకున్నా. ఇది మాణిక్యం సమ్మతితోనే జరిగింది. కొడుకే వెలుగనుకుంటున్నావా? ఎందుకలా అనుకున్నావ్! మన జయే మన యింటి వెలుగు. ఆడా మగా తేడా ఎందుకు సంతానంలో?.... జయ కోసమే మా ఇద్దరి జీవితాలు అంకితం చేస్తాం.'

ఇద్దరూ అలా దైవసాక్షిగా ప్రమాణం చేశారు.

తండ్రి ఇంకేదో చెప్పసాగాడు:

'రేపే జయకి స్కూల్లో ఫలితాలు చెబుతారు. నిరుడు మాదిరి సంబరం జరపాలని ఇవ్వాళే మాణిక్యాన్ని తీసుకువచ్చా. దేవతవైన నీ ఆశీస్సులు కావాలి.'

ఇద్దరూ తలలు వంచి సమాధికి నమస్కరించారు. జయ మనసు కుదుట పడింది. ఆనందంతో పొంగింది. వాళ్ళ కంటపడకుండా ఇంటికి పరుగుతీసింది. తండ్రిని అపార్థం చేసుకున్నానని విచారించింది.

ఇల్లుచేరి తండ్రీ చిన్నమ్మా రాకకోసం నిరీక్షించింది హారతి పళ్ళెంతో.

రాగానే 'నాన్నా! అమ్మా! లోపలికి రండి' అని హారతిచ్చి ఆహ్వానించింది.

ఆ మాట విని ఆశ్చర్యపోయి, సంతోషం పట్టలేక జయని ఇద్దరూ కలిసి గుండెలకు హత్తుకున్నారు. నాయవమ్మ ఆనందబాష్పాలతో అందరినీ దీవించింది.

*('ఆంధ్రభూమి' మాసపత్రిక - జనవరి, 1994)*